1984 రక్తాక్షి ఉగాది సస్పెన్స్ కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన రచన

# ఇంతచేస్తే

## భాగవతుల లలితశర్మ

"ఆఖరిసారి అడుగుతున్నాను ! చెప్తావా, చెప్పవా?"

"చెప్పను!"

"ప్లీజ్.... చెప్పు !"

"ప్లీజ్.... చెప్పను !"

"చెప్పకపోతే చంపేస్తాను !"

"చంపేశాక ఇంకేం చెప్తాను! బతికుంటే ఎప్పటికేనా?...." పకపకా నవ్వింది శృతి !

దాంతో మరింత తిక్క రేగింది శాస్త్రికి. ఇంకా నవ్వుతోంది శృతి ! చేతకానితనం మొగతనంగా మారింది.

చెంప చెళ్ళుమనిపించేడు.

ఠక్కున నవ్వాగిపోయింది.

చేరడేసి కళ్ళూ చెరువులయ్యాయి.

గిరుక్కున వెనక్కి తిరిగి వంటింట్లోకెళ్ళిపోయింది శృతి. 'ఎందుకు కొట్టానా?' అనుకున్నాడు శాస్త్రి. 'ఇంక చెప్తుందిలే చచ్చినట్టు!' అనుకున్నాడు మళ్ళీ! శాస్త్రి అనుకున్నట్టూ-చచ్చినట్టూ చెప్పలేదు శృతి.

గదిలోకొచ్చి. చకచకా నాలుగు చీరలు సర్దుకొని బాగ్‌లో పెట్టుకుంటోంది. పెట్టుకుంటూ వెక్కిళ్ళు పెడ్తోంది. వెక్కిళ్ళు పెడ్తూ అనవలసిన నాలుగూ అనేస్తోంది. "ఇంత చిన్న విషయానికి చెయ్యి చేసుకున్నారుకదూ! మొత్తానికి మొగాడనిపించుకున్నారులెండి! ఔనుమరి! పెళ్ళాన్ని కొట్టని మొగుడూ ఓ మొగుడేనా? ఏమంత ఘోరమైన తప్పుచేశానని కొట్టారసలు? చిన్నప్పట్నుంచి ఎవరిచేతా ఓ దెబ్బతిని ఎరుగను. ఈనాడు....ఇంత చిన్న విషయానికి చెంపలు వాయించేరు" ముక్కూ- మొహం పమిటతో తుడుచుకొని పెట్టె, బాగు పట్టుకొని బయటికి నడిచింది. "స్టేషన్‌కా? నేను దిగబెట్టనా?" అనబోయి నాలిక కరుచుకున్నాడు శాస్త్రి. 'వెళ్ళనీ! మంచిదే!' అనుకున్నాడు.

శృతి వెళ్ళిపోయాక— బోసిపోయిన ఇంట్లో మంచం మీద బోర్లా పడుకొని తీరిగ్గా ఆలోచించడం మొదలెట్టాడు శాస్త్రి....తను చేసిన పని ఎంత సవ్యంగా వుందా ? అని.

'చిన్న విషయం - చిన్న విషయం అంటుంది గాని అదెంత పెద్ద విషయమో మొగుడిగా తనొక్కడికే అర్థమవుతుంది. ఒక రోజా—రెండు రోజులా—సుమారు నెల్లాళ్ళయి బతిమాలుకుంటున్నాడు. చెప్పమి! చెప్పదుగాక చెప్పదు! మొండి ఘటం. బాగా ముద్దుచేశారు వాళ్ళ అమ్మానాన్ననూ. మరీఅంత మొండితనంఏమిటి? మొగాడి మంచితనాన్ని. ఓర్పుని అలుసుగా తీసుకుంటే ఎవడేనా ఏంచేస్తాడు ఆఖరికి? ఇంతకీ ఏముందో ఆందులో చెప్పదుకదా.... ఖర్మ!' శాస్త్రికి నెలరోజుల క్రితంట జరిగిన సంఘటన గుర్తొచ్చింది. ఆ వేళ తలనొప్పిగా వుందని- మధ్యాహ్నం మూడింటికే ఆఫీసునుంచి వచ్చేశాడు. ఓరగా వున్న తలుపు తొయ్యబోయి లోపలి దృశ్యంచూసి ఆగిపోయాడు. బట్టల బీరువా సర్దుకొంటోంది తీరిగ్గా శృతి. చుట్టూ చిందరవందరగా బట్టలూ- వాటి మధ్య శృతి- శృతి చేతిలో ఏదో ఓ చిన్నపెట్టె. ఆ పెట్టెలో ఏముందో మరి మూత జాగ్రత్తగా పెట్టేసి పదిలంగా రెండుచేతుల్లో పట్టుకొని-కళ్ళు కిందకివాల్చుకొని ఏవో మధురోహల్లో తేలిపోతోంది. మధురస్మృతుల ఛాయలు అందంగా

### పరిచయం

జన్మస్థలం విశాఖపట్నం. పుట్టిన తేదీ 15-9-1946. నివాసం భిలాయి. ఆంగ్ల సాహిత్యంలో రాయపూర్ రవిశంకర్ విశ్వవిద్యాలయం ద్వారా ఎమ్. ఎ డిగ్రీ పొందాను. దుర్గ్ 'విశ్వదీప్' ఇంగ్లీష్ మీడియమ్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నాను. శ్రీవారు-శ్రీ భాగవతుల మంగశర్మ- భిలాయి స్టీలు ప్లాంటులో ఉద్యోగం. మాకు ఇద్దరబ్బాయిలూ- ఒక అమ్మాయి.

ఇప్పటిదాకా సుమారు ఇరవై వరకు కథలూ. కవితలూ వ్యాసాలు. ఆంధ్ర పత్రిక. వనిత. మహిళ లోనూ. భిలాయి-స్థానిక సాహితీ మాసపత్రిక 'చేతన' లోనూ ప్రచురించబడ్డాయి చేతన నిర్వహించిన స్థానిక కథల పోటీలో అనేకమార్లు ప్రథమ, ద్వితీయ బహుమతులందుకున్నాను. "ఆంధ్రజ్యోతి"లో నా కథ ప్రచురించటం ఇదే మొదటిసారి. ధన్యవాదాలు.



—భాగవతుల లలితశర్మ




మొహంలో వరుచుకోగా-అద్భుతంగావెలిగిపోతోంది శృతి ముఖం పైడపోజులో! పెట్టెలో ఆమెను అంతగా పరవశింపజేసేదేముందో.... అందుకే మరి ఆతృత ఆపుకోలేక గభాలున తలుపు తీసుకొని లోపలికొచ్చాడు శాస్త్రి. శృతి గాభరాగా లేచి చేతిలో పెట్టె బీరువాలో పెట్టేసింది. ఏమీ ఎరగనట్టూ—"అదేమిటీ అప్పుడే వచ్చేశారూ" అంటూ బట్టలన్నీ ఆదరాబాదరా కుక్కడం మొదలెట్టింది బీరువాలో. "కొంచెం తలనొప్పిగా వుందిలే! సరేగాని- బట్టలుసర్దడంతొందరగాముగించేశావేం?ఇంతకీ ఆ పెట్టేమిటీ .. ఇందాకనీచేతిలో" అంటూ బీరువాదగ్గరకొచ్చాడు శాస్త్రి. "ఇంకోరోజు సర్దుతాలెండి పదండి అమృతాంజనం రాయనా?" అంటూ మాట మార్చేసి. బీరువా తాళం వేసేసింది.

"రాద్దువుగానిలే! ఇంతకీ ఆ పెట్టే మిటో చూపిద్దూ! నేనూ ఆనందిస్తాగా చూసి!" అన్నాడు నవ్వుతూ.

"మీ కెందుకూ! ఏవో రహస్యాలు దాచుకున్నాను అందులో" అంది కవ్వింపుగా చూస్తూ! ఆ మాటతో ఆతృత మరింత పెరిగిపోయింది శాస్త్రికి. "మన మధ్య రహస్యాలేమిటి? చూపించొద్దులే పోనీ! చెప్పు! వింటాను అదేమిటో!" అన్నాడు విసుగ్గా! శృతి మొహం ఎర్రగా కందగడ్డలాగయింది. "ఊహూం.. చెప్తే. మీరు.... అమ్మో.... ఇంకేమేనా వుందా?" అంటూ అక్కడి నుంచి వెళిపోయింది. ఇంక అడగడం అనవసరం అనిపించింది శాస్త్రికి.

రాత్రంతా దానిగురించే ఆలోచనతో నిద్ర పట్టలేదు శాస్త్రికి. 'ఏముంది.... ఆ చిన్న రేకుపెట్టెలో! డబ్బులా! నాతో చెప్పకుండా రహస్యంగా దాచుకుంటోందేమో! ఖర్చులన్నీ నేనే పెడతాగా.... దాచుకొనేన్ని డబ్బులెక్కడివీ తనకి? కొంపతీసి.... "లా లెటర్సు" కాదుకదా! ఏమో! ప్రేమలేఖలే అవొచ్చు! పెళ్ళికాకముందు ఎవడో ప్రేమించే ఉంటాడు. అసలే అందంగా వుంటుందికదా! ఆ అందంఅంతా ఆప్రేమలేఖల్లో వర్ణించి వుంటాడు. నేను లేనప్పుడు రహస్యంగా తీసి చదువుకుంటోంది. రోజుకోసారి ఒంటరిగా చదువుకొని పరవశించిపోతూ వుంటుంది కాబోలు. ఇవేళ అనుకోకుండా నేను త్వరగా రావడం వలన బయటపడిపోయింది....' మనసు భగ్గున మండిపోతోంది శాస్త్రికి. పక్కకి తిరిగి చూశాడు గాఢ నిద్రలో వుంది శృతి. మెడలో మంగళ సూత్రాలు

## కాలమ్ దాటని కథ

గోపీనాథ్ నిర్మించిన తొలి చిత్రం "విప్లవం" బాక్సాఫీస్ హిట్ అయ్యింది. దాంతో అదే రకంగా విప్లవాత్మక చిత్రం మరొకటి నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. కథ సిద్ధమైంది. చిత్రం పేరు "దోపిడీ నశించాలి". కొత్తవాళ్ళతో నిర్మించమని ఎవరో ఇచ్చిన సలహా నచ్చి ఆ రకంగానే చెయ్యాలనుకున్నాడు. "కొత్త నటీనటులు కావలెను" అన్న మకుటంతో పత్రికా ప్రకటన ఇచ్చాడు. ఎన్నో అప్లికేషన్లు వచ్చాయి. .... వాటిలో కొన్ని నచ్చాయి. ఇంటర్వ్యూలకు పిలిచాడు. అమ్మాయిలలో "సురేఖ" అనే ఆమెను సెలక్టుచేశాడు అబ్బాయిలలో "శ్రీకాంత్"ని ఎన్నుకున్నాడు. వాళ్ళిద్దరికీ "దోపిడీ నశించాలి" చిత్రంలో నాయికా నాయకులుగా ఛాన్సు ఇస్తానని చెప్పాడు. వాళ్ళిద్దరి ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది.



### దోపిడీ నశించాలి

సురేఖతో ఏదో మాట్లాడాడు. ఆమె ముందు అంగీకరించలేదు. ఆమెకు భవిష్యత్తుపై ఆశలు చూపించాడు.. పాపం.. ఆమె లొంగిపోయింది.

ఆ తర్వాత శ్రీకాంత్‌తో మాట్లాడాడు. కొంత సొమ్ము పెట్టుబడిగా పెడితేనే ఆ హీరో ఛాన్సు ఇస్తానన్నాడు. ముందు ఒప్పుకోలేదు శ్రీకాంత్. అతనికూడా ఏవేవో ఆశలు చూపించాడు. భావి తరంలో హీరో కావడానికి ఈ బంగారు అవకాశం వదులుకోవద్దన్నాడు. ఒప్పుకున్నాడు శ్రీకాంత్.

సురేఖ. శ్రీకాంత్‌లు నాయికా నాయకులుగా "దోపిడీ నశించాలి" చిత్రం తయారయింది. విడుదలయిన మర్నాటి నుంచీ మంచి కలక్షన్లు వచ్చాయి. బాక్సాఫీస్ హిట్ అయింది. పాతిక సెంటర్లలో నూరు రోజులు నడిచింది. పది సెంటర్లలో పాతిక వారాలు నడిచింది. నిర్మాతకీ. హీరో హీరోయిన్లకీ సన్మానాలు చేశారు.

"నా ఆశయాలకు ప్రతిరూపం" ఈ చిత్రం....అన్నాడు గోపీనాథ్.

"దోపిడీ నశించాలి" చిత్రంలో నటించిన సురేఖ, శ్రీకాంత్‌లు తమని గోపీనాథ్ దోచుకున్న తర్వాతే అవకాశం ఇచ్చాడని చెప్పుకోలేకపోయారు.

పైగా ఆ ఇద్దరూ—

"నిర్మాతగారి ఆశయాలకు అద్దం యీ చిత్రం...."అన్నారు.

—పాలకూర సీతాలత

పైటలోంచి బయటపడి మెరుస్తున్నాయి. మంగళసూత్రాల మధ్య పిన్నుకి పెట్టిన బీరువా తాళంచెవి మీద పడింది శాస్త్రి దృష్టి. నెమ్మదిగా ఆ తాళంచెవి పిన్ను నుంచి వేరు చేశాడు నిశ్శబ్దంగా మంచం దిగి బీరువా వేపు నడిచేడు. మెల్లిగా బీరువా తెరిచాడు. బట్టలకిందనున్న రేకు పెట్టె బయటకు లాగేడు కంగారులో బీరువా తలుపు మోచేతికి కొట్టుకొని చప్పుడయింది. శృతి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. అంతే! రివ్వున మంచం దిగివచ్చి శాస్త్రి చేతిలోని పెట్టెని లాగేసుకుంది. శాస్త్రి నీరు కారిపోయి చూస్తూ వుండిపోయాడు. ప్లానంతా పాడయిపోయి దొంగతనం చేస్తూ పట్టుబడిపోయినందుకు తననితాను తిట్టుకున్నాడు కసితీరా! శృతి దురుసుతనానికీ. తన చేతకానితనానికి వాళ్ళు మండిపోతోంది ఓ వేపు. శృతి పెట్టెని బీరువాలో బట్టల సందున పెట్టేసి— బీరువా తాళం వేసి. "ఛీ! ఇదేం పని!" అన్నట్టు అసహ్యాన్ని వ్యక్తంచేసే ఓ చూపు విసిరి— వెళ్ళి మంచల మీద పడుకుంది మళ్ళీ! చేసేది లేక కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి తనూ పడుకున్నాడు శాస్త్రి.

అది మొదలూ మాటలు లేవు వాళ్ళిద్దరికీ! మరీ ఇంత అనుమానం మనిషేమిటి?' అనుకుంటోంది శృతి. 'మరీ ఇంత మొండితనం ఏమిటి?' అనుకుంటున్నాడు శాస్త్రి బీరువా తాళం చెవి ఎక్కడో రహస్య స్థావరంలో దాచుకుంటోంది యీ మధ్య!

ఆఖరికి ఇవాళ ఇంక ఉగ్గబట్టకోలేక మళ్లీ అడిగాడు శాస్త్రి. 'ముద్దుగ అడిగితే చెప్పకూడదూ! తన పంతం తనదే! మంచి పనైంది-వెళ్ళనీ' అనుకున్నాడు కసిగా. వెళ్ళి ఏం చెప్తుందో పట్టింట్లో' అనుకున్నాడు మళ్ళీ భయంగా. ఏం తోచక లేచి కాలుగాలిన పిల్లిలా తిరిగాడు ఆ గదిలో. చిందర వందరగా వున్న పరుపూ దుప్పటీ సర్దాడు తలగడాలు సరిగా పెట్టబోతూ వుండే వున్నట్టుండి శాస్త్రి కళ్ళు మెరిశాయి ఆనందంతో తలగడ కింద బీరువా తాళం చెవి! 'తొందరలో దీని సంగతి మర్చిపోయిందిపాపం:' అనుకుంటూదాన్ని అందుకున్నాడు ఆప్యాయంగా బీరువా తెరిచాడు ఆతృతగా వణుకుతున్న చేతులతో రేకుపెట్టె తీశాడు అదురుతున్న గుండెలతో తెరిచాడు. ఊపిరి బిగపెటి చూసేడు అందులోకి. అతని ఆతృత ఆశ్చర్యంగామారిపోయింది. ఇంతింత కళ్ళుచేసుకొని అలా చూస్తూ వుండిపోయాడు. బెలూను వూది వూది గుమ్మడికాయంత అయినాక పిన్నుతో కన్నం పెట్టినట్టయింది శాస్త్రి పరిస్థితి. తేలిగ్గా నిట్టూర్చాడు. అతని పెదవులమీద చిరునవ్వు విరిసింది. నెమ్మదిగా పెట్టెలో చెయ్యి పెట్టాడు. వేళ్ళతో ఆప్యాయంగా తాకాడు వాటిని. మంచం దగ్గరికి నడిచేడు. వాటిని జాగ్రత్తగా బయటికి తీసి మంచం మీద పెట్టాడు.

తాటాకు రేకుల్తో చేసిన బొమ్మలవి!

పెళ్ళి కూతురూ. పెళ్ళికొడుకూ!

ఆడపిల్లలాడుకొనే బొమ్మల పెళ్ళి బొమ్మలవి!

బొట్టూ కాటుకతో. సిల్కు బట్టల్లో. ముచ్చిరేకుల్తో చేసిన ఆభరణాలతో కళకళ్ళాడుతూ ఎంతో ముద్దొస్తున్నాయి. మరెంతో ముచ్చటగా వున్నాయి.

వాటిని మళ్ళీ రేకు పెట్టిలో సర్ది యథాప్రకారంగా బీరువాలో పెట్టి తాళం వేసి. వాచీ చూసుకున్నాడు శాస్త్రి— శృతి వాళ్ళ వూరికి ఇంకో ట్రెయిన్‌కేనా టయిముందేమోనని! ●

